కట్నమే ముఖ్యమనుకున్న వారికి ఆమె కలిగించిన కనువిప్పు?

# ముచ్చర్ల రజనీశకుంతల కథ

# షష్టిపూర్తి

"కాలేజీ నుండి తొందరగా రా కావ్యా!" కాలేజీకి వెళుతూంటే జ్యోతి అన్న మాటలకి వెనక్కి తిరిగింది కావ్య.

"ఏంటి వదినా విశేషం?"

"విశేషం చెప్తేగానీ రావా?" జ్యోతి చిరునవ్వుతో అడిగింది. "అలాని కాదు. ప్రైవేట్ క్లాసు ఉంది. ముఖ్యమైనదయితే వద్దామని..."

"ఎదురింటి ఆనందరావుగారింట్లో 'షష్టిపూర్తి' మహోత్సవం ఉంది. మీ అమ్మగార్కి కాస్త ఒంట్లో నలతగా ఉందట. మనిద్దరినీ ఫంక్షన్‌కి వెళ్ళి రమ్మన్నారు. అందుకే చెప్తున్నాను"

"హుఁ! వస్తాన్లే. అమ్మ ఆర్డర్ వేశాక తిరుగుండదు కదా!" అంటూ బయటికి నడిచింది కావ్య.

* * *

కావ్య తండ్రి మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగం. చాలీచాలని బ్రతుకులు. ఇద్దరు కొడుకులు, ఇద్దరమ్మాయిలు. పెద్దకొడుక్కి

పెద్దమ్మాయికి ముక్తసరిగా పెళ్ళి జరిపించారు. ఇంకో కొడుకు టెలిగ్రాఫ్ ట్రైనింగ్‌కి మైసూర్ వెళ్ళాడు. ఆఖరమ్మాయి కావ్య. కాలేజీలో బియ్యే ఫైనలియర్ చదువుతోంది

కట్నాల బెడద వలన నేటి వివాహ వ్యవస్థ ఎలా ఉందో ఆ కుటుంబానికి పూర్తిగా తెలుసు. దానికి ఉదాహరణ కావ్య ఇప్పటివరకూ ఇరవైసైగా 'పెళ్ళిచూపుల్లో' కూర్చోడమే. కుందనపు బొమ్మలా ఉన్న



కావ్య అందరికీ నచ్చినా, ఆమె తండ్రి ఇస్తానన్న కొంచెం కట్నం ఎవ్వరికీ నచ్చలేదు. అందుకే వచ్చిన సంబంధాలన్నీ ఏదో వంకతో వెళ్ళిపోతున్నాయి.

'పెళ్ళిచూపులంటేనే' కావ్యకి అసహ్యం వేస్తోంది. బాగా చదువుకొని, ఉద్యోగం సంపాదించి తన కాళ్ళ మీద తను నిలబడాలని అనుకుంది.

ప్రతి 'పెళ్ళిచూపులకి' తల్లికి, కావ్యకి గొడవే. "ఇక నాకు సంబంధాలు తేకండి. 'ఎవరికీ నచ్చలేదని' నాకు ప్రత్యక్షంగా తెలియడంతో జీవితం అంటేనే విరక్తి వస్తోంది. కట్నం నచ్చలేదని ఫ్రాంక్‌గా చెప్పవచ్చుగా. నా మీద వంక పెట్టడం ఎందుకు. ఈసారి ఆ టైప్‌కి నేను ఇంట్లో ఉండనే ఉండను"

"ఎదిగిన పిల్లని ఇంట్లో ఎన్నాళ్ళట్టి పెట్టుకుంటామే..." అంటూ తల్లి సణుగులు.

ఇవన్నీ వారానికోసారి ఆ ఇంట్లో మామూలే.

* * *

మెట్లు దిగుతూ ఎదురింటివైపు చూసింది. మూడంతస్తుల అందమైన భవనం అది. మామిడి తోరణాలతో, లైట్లతో, షామియానాలతో సుందరంగా ఉంది. పట్టుచీరల రెపరెపలు, పిండివంటల సువాసనలతో మొత్తం ఆ వీధికే 'చందమామ'లా ఆ బిల్డింగ్ మెరుస్తోంది.

గుమ్మానికి తోరణాలు కడుతున్న కల్యాణ్ కావ్య గేటు వేస్తున్న చప్పుడికి ఇటువైపు తిరిగాడు.

కావ్య తలదించుకుని నడవసాగింది. వాళ్ళ గుమ్మం ముందుకు రాగానే కల్యాణ్ గబగబా వస్తూ "కావ్యగారూ! సాయంత్రం ఫంక్షన్‌కి తప్పక రావాలి..." అన్నాడు.

వీలైనపుడల్లా తనని పలకరించాలనీ, మాట్లాడాలనీ అతను చేస్తున్న ప్రయత్నాలన్నీ చాలా రోజుల నుంచీ కనిపెడుతూనే ఉంది కావ్య.

ఆడపిల్ల కనపడగానే ఈ డబ్బున్న మగ మహారాజులకి వొళ్ళు తెలీదు. ప్రేమ, దోమ అంటూ వెంటపడటం, మోసం చెయ్యడం. 'ప్రేమ వివాహం' మీద అసలు నమ్మకంలేని కావ్య కల్యాణ్ ఎప్పుడు పలకరించినా ముక్తసరిగా సమాధానం చెప్పి వెళ్ళిపోతుంది.

అయినా తను పలకరించిన రోజున ఏదో తెలియని హాయిగా అనిపిస్తుంది. అతని అందమైన రూపం కళ్ళముందు పదేపదే గుర్తొస్తుంది. అందం, దానికి తగ్గ పెర్సనాలిటీ ఉన్న కల్యాణ్ కావ్య మనసులో చిరుఅలజడి కలిగజేశాడు. అలాంటి ఆలోచనలు వచ్చినపుడు బలవంతంగా మనసుని మరోవైపు మళ్ళించుకుంటుంది కావ్య.

"ఏమిటండీ... నిలబడే నిద్రపోతున్నారా?"

చిలిపిగా నవ్వుతూ అడుగుతున్న కల్యాణ్‌ని చూసి ఉలిక్కిపడి ఆలోచనలు ఆపి "ఆ! ఏమిటన్నారూ...!" అంది, తన పరధ్యానానికి అతను ఏమనుకుంటాడో అని సిగ్గుపడుతూ.

"ఈవినింగ్ మా డాడీవాళ్ళ షష్టిపూర్తి ఉంది. తప్పకుండా రావాలి మీరు..."

"సరే..."

"మీ కోసం ఎదురుచూస్తుంటాను..." అని అందామనుకున్నాడు కల్యాణ్. కానీ అప్పటికే కావ్య రెండడుళ్ళ అవతలకి దాటిపోయింది.

కల్యాణ్ వెళుతున్న కావ్యనే చూడసాగాడు. లయబద్ధంగా ఊగుతున్న వాలుజడ,

తలలోని పూలు అతన్ని మరింత మురిపించాయి.

* * *

"నాది ఎర్రరంగు పట్టుచీర కట్టుకో కావ్యా...!" తల్లి మంచం మీద నుండే జడ వేసుకుంటున్న కావ్యతో అన్నది.

"అమ్మా! నీకున్న ఆ ఒక్క పట్టుచీర ఎన్నిసార్లని కడతాను. పెళ్ళిళ్ళకీ అదే, ఫంక్షన్స్‌కీ అదే, పెళ్ళిచూపులకీ అదే.. అయినా ఏం, పట్టుచీర కట్టుకోకపోతే ఆ ఫంక్షన్‌కి రానీయరా? నేను ఛస్తే కట్టుకోను ఆ చీర. కావాలంటే మానేయమంటే మానేస్తాను..."

"నువ్వేం మానక్కర్లేదు మరదలుపిల్లా. ఇదిగో నాది ఈ గ్రీన్ చీర కట్టుకో. నీకు మేచింగ్ బ్లౌజ్ ఉన్నట్లుంది..." అంటూ జ్యోతి వచ్చి కావ్య చేతిలో పట్టుచీర పెట్టింది.

"వదినా...! ఏం అనుకోకు. నాకొద్దు. నా సౌత్‌కాటన్ చీర నాకు చాలు. అయినా ఏమిటి మీరిద్దరూ! పట్టుచీర కట్టుకుంటేనే రానిస్తారా...?" కోపంగా అంటున్న కావ్యను చూసి తల్లి, జ్యోతి మరేం మాట్లాడలేదు. వాదన పెంచితే మొత్తానికే కావ్య మానేస్తుందని తెలుసు. "ఊ! నీ ఇష్టం తల్లీ...!" అంటూ పూలమాల జడలో పెట్టి "పద వెళదాం" అంది.


గర్వంగా నవ్వుకుంటూ నడిచింది కావ్య.

* * *

రంగరంగ వైభవంగా ఉంది ఆ ఇల్లంతా. ఎటుచూసినా పచ్చని తోరణాలు, లైట్లు, కనుల పండుగగా ఉందక్కడ.

పెద్దహాలు మధ్యలో మల్లెలతో పూలపందిరి. పీటల మీద ఆనందరావుగారు, సతీమణి జానకీదేవి.

అరవయ్యేళ్ళ ఆనందరావు ఇరవైలా ప్రవ



రిస్తున్నారు. జానకీదేవి సిగ్గుతో తలవంచుకుంది.

కావ్య వాళ్ళవే తదేకంగా చూడసాగింది. ఎంత విచిత్రం. ఒక్క పెళ్ళికే నోచుకోని తమలాంటి ఎందరో ఆడపిల్లలు దేశంలో ఉండగా, ఒకసారి పెళ్ళయి, పిల్లల్ని కని, మనుమలు, మునిమనుమరాండ్రు కూడా ఉన్న ఈ ఆనందరావు దంపతులు మళ్ళీ తిరిగి పెళ్ళి చేసుకోవడమా...! అదీ ఇంత వైభవంగానా. తమలాటి వాళ్ళింట్లో రెండు, మూడు పెళ్ళిళ్ళకయ్యే ఖర్చు ఇప్పుడు వీళ్ళకి అవుతుండవచ్చు.

జరిగిన వాళ్ళకే మళ్ళీ పెళ్ళి. షష్టిపూర్తి పేరుతో ఇంత ఖర్చు పెడుతున్న వీళ్ళకి అసలు బాధ అంటే ఏవిటో తెలుసా! ఆకలంటే ఎరుగుదురా?

తమ ఇంట్లో ఎన్నో రోజులు ఆకలితో పస్తులుండటం ఎరుగును తను. అవన్నీ వీళ్ళకి తెలుస్తాయా? అసలు ఆలోచిస్తారా! పెద్దలు సంపాదించిపెట్టిన ఆస్తి ఉంది. చదువుకుని పెద్ద బిజినెస్ మాగ్నెట్‌గా పేరు పొందిన ఆనందరావుగారు మరి ఇలాంటి వాటికి ఖర్చు పెడితే అసలు తప్పేం ఉంది.

పీటల మీద మంగళసూత్ర ధారణ జరుగుతోంది. బాజాలు గట్టిగా ఊదారు. పచ్చని మాంగల్యంతో జానకీదేవి సిగ్గుల మొగ్గే అయింది.

తలంబ్రాలు.

కొడుకులు, కోడళ్ళు, కూతుర్లు, అల్లుళ్ళు, మనుమలు అందరూ చుట్టూ చేరి కేరింతలతో "మీరు ముందు పొయ్యండి... అంటే... మీరు పొయ్యండి" అంటూ ఏడ్పించసాగారు.

ఆఖరికి ఆనందరావుగారే నెగ్గారు.

బిందెలో ఉంగరాలు తియ్యడం, అన్నిటిలోనూ ఆనందరావే గెలవడం, జానకీదేవికి ఓటమి కూడా తీయగా అనిపిస్తున్నట్లుంది చిరునవ్వు నవ్వుతోంది.

కావ్య పరవశంగా చూడసాగింది ఇద్దరినీ.

"ఆంటీ... ఆ... అంకుల్ నిన్ను పిలుస్తున్నాడు..." అంటూ ఎవరో ఓ పాప వచ్చి చెప్పడంతో ఆ పాప చూపిన వైపు చూసింది.

స్తంభానికి ఆనుకుని కల్యాణ్ ఇటే చూస్తున్నాడు. కావ్య అటు చూడ్డంతో కళ్ళతోనే రమ్మన్నట్లు సైగ చేశాడు.

కావ్య గుండె క్షణంసేపు చిత్రంగా కొట్టుకుంది.

వెళ్ళడమా... వద్దా... అన్న సందేహంతో ఆగిపోయిన కావ్యని చూసి "ప్లీజ్..." అన్నాడు దూరం నుండే దిగులుగా మొహం పెట్టి.

వదిన వైపు చూసింది. ఆవిడ తెలిసున్న వాళ్ళతో మాట్లాడుతోంది.

కావ్య తప్పదన్నట్లు లేచింది. కల్యాణ్ వైపు చూపింది. అతను వీడియో వానితో ఏదో చెప్తూ తనవైపు చూపెడుతున్నాడు.

అతను వీడియోను కావ్యవైపు తిప్పాడు. ఆ వెలుతురుకి మొదురు చిట్లిస్తూ 'చెప్తా ఉందు నీ పని...' అన్నట్లు కోపంగా

చూసింది కావ్య కల్యాణ్ ని.

అతను అదేం పట్టించుకోనట్లు తదేకం గా చూస్తున్నాడు. దగ్గరగా వచ్చిన కావ్యని చూస్తూ "రండి... మీతో కొంచెం మాట్లా డాలి..." అన్నాడు.

"ఇప్పుడేవిటి?"

"ప్లీజ్... మీతో ఎన్నాళ్ళ నుండో మాట్లాడాలనుకుంటున్నాను. మీరా అవకాశం ఇవ్వనే ఇవ్వరు. ప్లీజ్..." మరోసారి దీనంగా మొహం పెట్టి అడుగుతున్న కల్యాణ్ ని చూస్తే మరేం మాట్లాడబుద్ది కాలేదు కావ్యకి.

అతను దూరంగా ఉన్న గదివైపు నడిచా డు తనతో రమ్మన్నట్లుగా.

అతని వెంట మంత్రముగ్ధలా నడిచింది. గది కీ తీస్తూ "ఇదే నా రూమ్... ప్లీజ్ కమ్..." అన్నాడు.

కావ్య బెదురుగా చూస్తూ లోపలికి అడుగుపెట్టింది. డబుల్ కాట్, అందంగా ఓ వైపు షో కేస్ లో అమర్చిన బొమ్మలు, ఏసి, టివి, విసిఆర్.

'అబ్బ! సినిమా సెట్టింగ్ లా ఉంది అమ్మ ఈ రూమ్' మనసులోనే అనుకుంది కావ్య.

"చాలా రోజుల నుండి మీతో చెప్పాలను కుంటున్నాను కావ్యా! మీరంటే నాకిష్టం. ఐ... లవ్... యూ..." నిజాయితీగా చెప్తున్న అతన్ని తెల్లబోయి చూసింది కావ్య.

మరుక్షణంలో కావ్య మొహంలో రంగు లు మారాయి. కోపంతో దిగ్గున లేచింది.

"కోపం తెచ్చుకోకండి. నిజంగా చెబు తున్నాను. ఐ... లవ్... యూ..."

"మిస్టర్ కల్యాణ్...! ప్రేమించి ఏం చేస్తారు" సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది కర్కశంగా.

"కావ్యా...!"

"అవును. తరువాత సమాధానం మీరు చెప్పలేరు. ఎందుకో తెలుసా! ప్రేమకి, పెళ్ళికి ఆకాశం, నేలకి ఉన్నంత దూరం ఉంది కాబట్టి.

మీలాంటి డబ్బున్న కుర్రాళ్ళ సంగతి నాకు తెలుసు. ప్రేమ పేరుతో వంచించి, నమ్మించి అవసరం తీరాక విసిరికొట్టే ప్రబుద్ధులు మీరు"



### భార్యభర్తలు

"ఇద్దరు భార్యా భర్తల్ని కలపడానికి మనం వెంటనే విడిపోయి మన ప్రేమను త్యాగం చెయ్యాలి లతా" చెప్పాడు సతీష్.

"అలాగే ఇంతకీ ఎవరా భార్య భర్తలు" అడిగింది రాణి.

"నేను, నా భార్య" తక్కున చెప్పాడు సతీష్.

—సి.శ్రీనివాసమూర్తి (హిందూపురం)

వింటున్న కల్యాణ్ మనసు బాధతో రెపరెపలాడింది. "అందరూ అలాగే ఉండరు..." అన్నాడు.

"కావచ్చు. కానీ, మీకెంత మంది వదినలు...?" చేతులు కట్టుకుని సీరియస్‌గా అడుగుతున్న కావ్యని చూస్తే వాలుగు తగిలించి దగ్గరికి లాక్కుని వాగుతున్న ఆ పెదవుల్ని తన పెదవుల్తో ఆపాలనిపించింది కల్యాణ్ కి.

"ఇద్దరు" అన్నాడు కాస్త కోపంగా.

"పెద్ద వదిన ఎంత కట్నం తెచ్చింది...?"

"లక్షన్నర..."

"చిన్నవదిన..."

"లక్ష డెబ్బై అయిదు..."

మరి మీకేం తీసుకోవాలనుకుంటున్నారు మీ అమ్మా, నాన్నగారు. కనీసం రెండు లక్షలు. కట్నం కోసం 'ఇల్లాలు' కావాలి. ప్రియురాలి కోసం ప్రేమ కావాలి. మీలాటి వారి సంగతి తెలియందెవరికి...?"

"కావ్యా! నే చెప్పేది వినిపించుకోకుండా ఏవిటా మాటలు. అసలు..."

"కల్యాణ్! ఇంకోసారి నన్నిలా పిలవకు..." విసురుగా తలుపు తీసుకుని ఇవతలకు రాబోయిన కావ్య హఠాత్తుగా తలుపు తెరుచుకుని ఆనందరావుగారు రావడంతో ఆగిపోయింది.

మధుపర్కం బట్టలు మార్చుకోవడానికి వచ్చిన ఆనందరావుగారు కావ్యని, కొడుకునీ చూస్తూనే ఒక అడుగు వెనక్కి వేశారు.

అతన్ని తప్పించుకుంటూ గుమ్మం దాటబోతూ ఆయన్ని చూసిన కావ్య జన్మలో ఆ చూపు మర్చిపోలేననుకుంది.

* * *

"ఆనందరావుగారు మిమ్మల్ని రమ్మని కబురుపెట్టారు. ఎందుకో ఓసారి వెళ్ళిరండి..." కాఫీ అందిస్తూ తల్లి శాంతి అంటున్న మాటలు గదిలో చీర కట్టుకోబోతున్న కావ్యకి వినపడ్డాయి.

"ఇప్పుడు పనుంది. సాయంత్రం ఆఫీసు నుండి వచ్చాక వెళతాలే..." అంటూ రామారావు వెళ్ళిపోయాడు.

అయితే... ఈ విషయం మర్చిపోలేదన్న మాట ఆయన. తన తండ్రిని పిలిచి తిడతాడేమో...! ఇదంతా తల్లి, తండ్రికి తెలిస్తే లేనిపోంది ఊహిస్తారు అనుకుంది కావ్య. రాబోతూ అతను చూసిన చూపులే కలవరపెడ్తున్నాయి కావ్యని.

ఏం ఊహించి ఉంటాడు అతను.

ఎంత అసహ్యాకరమైన పరిస్థితి.

తనపై ఎంత చెడ్డ అభిప్రాయం కలుగుతుందో! ఇదంతా ఆ కల్యాణ్ వలన.

అసలు తనకు బుద్ధిలేదు. వెళ్ళకుండా ఉంటే ఎంత బావుణ్ణు.

ఇంతకీ తను తన తండ్రి వెళ్ళక ముందే వెళ్ళి ఆయన్ని కలుసుకుని అసలు సంగతి చెప్పాలి. యస్... కాలేజీకని చెప్పి వాళ్ళింటికి వెళ్ళాలి. ఎలాగైనా ఆయనకి చెప్పి తీరాలి. తనదేం తప్పులేదని.

అప్పటికిగానీ తనకు తృప్తి ఉండదు.

ఒక నిశ్చయానికి వచ్చింది కావ్య.

* * *

మెట్లు దిగుతూంటేనే ఎదురింటి దీప్తి వచ్చి-

"ఆంటీ... మా కల్యాణ్ అంకుల్ నీకు దీన్నివ్వమన్నాడు. పాపం! అంకుల్‌కి జ్వరం కదా! లీవ్‌లెటర్ నీకిచ్చి రమ్మన్నాడు" అంటూ కావ్య చేతిలో చీటీ పెట్టి తుర్రుమని పారిపోయింది దీప్తి.

కావ్య గుప్పిటలో ఆ కాగితం నలిగిపోయింది. కసిగా పళ్ళు నూరుతూ గబగబా ఆనందరావు గారింట్లో అడుగుపెట్టింది.

జానకీదేవి హాల్లోనే ఎదురైంది.

"రా కావ్యా...! ఏవిటి సంగతి?"

"ఆంటీ... అంకుల్‌తో మాట్లాడాలి. ఎక్కడున్నారు?" ముక్తసరిగా అంది.

"పైన ఉన్నారు వెళ్ళమ్మా!" అంది చిరునవ్వుతో.

* * *

పైప్ కాలుస్తూ, పేపర్ చదువుతున్న ఆనందరావ్‌గార్ని చూడగానే క్షణంసేపు బెరుకుగా అనిపించినా స్థిరంగా ముందుకు అడుగువేసింది.

"అంకుల్..."


పేపర్ పక్కన పెట్టేస్తూ... "రా... కావ్యా..." అన్నారు ఎలాటి భావం ముఖంలో కనపడనీయకుండా.

"అంకుల్... విన్న... అసలు... నేను... కల్యాణ్ ... అతనే పిల్చి..." చెప్పలేకపోతున్నట్లు ఆగింది.

"నేనసలు ఏం అడగలేదే. ఎందుకు చెప్తున్నావ్...?" ఆనందరావ్ అన్న మాటలకి కాస్త ధైర్యం వచ్చింది కావ్యకి.

"అంకుల్. మీరడగకపోయినా చెప్పాల్సిన బాధ్యత నా మీద ఉంది. కల్యాణ్ మాట్లాడాలి రమ్మంటే తప్పనిసరిగా వెళ్ళాను. అతను నన్ను ప్రేమిస్తున్నాడట. పెళ్ళి చేసుకుంటాడట. నేను నమ్మలేదంకుల్. ఎందుకంటే మీకు, మాకు చాలా భేదం ఉంది. అడుగడుగునా ఐశ్వర్యంతో కలకలలాడుతున్న మీతో నేను సరితూగలేను.

అసలు అదే విషయం అతనికి విక్కచ్చి



## మూలకాలు

సృష్టిలో 92 ప్రకృతిసిద్ధ మూలకాలున్నాయి. వీటిలో మొదటి మూలకం 'హైడ్రోజన్'. ఇది అతి తేలికయినది. చివరిది 'యురేనియం'. ప్రపంచంలో అతి బరువయిన మూలకం ఇదే. ఈ 92 మూలకాలతోనే మనకు కన్పించే వస్తువులన్నీ ఏర్పడ్డాయి.

-మధ్యాహ్నపు లీలానంద్

గా చెప్పాము. అంతలో మీరు... వచ్చారు...

"అంతేనా...?" ఆయన అదోలా చూస్తూ అడిగారు. "అవునంకుల్. మీరు నమ్మినా, నమ్మకపోయినా అది నిజం. మీరు మా నాన్నగార్ని పిలిపించారట. ఆయనకీ విషయాలన్నీ తెలిస్తే లేని...పోని... గొడవలు... అవు...తాయి.

కూతురికి పెళ్ళి చెయ్యలేకపోతున్నానని ఇప్పటికే ఆయన బాధతో నలిగిపోతున్నారు. ఇలాంటి సమయంలో...

"అందుకని ఏం చెప్పవద్దంటావ్..." ఆయన గంభీరంగా అన్నారు.

"అవును"

"చెప్పక తప్పకపోతే..."

రోషంతో "అంకుల్... తప్పు మీ అబ్బాయిలో ఉంచుకుని అసలు మమ్మల్ని అంటారేం. నేను నిజంగా, న్యాయంగా జరిగింది చెప్పాను. ఆ తర్వాత మీ ఇష్టం. ఎదిగిన కొడుకుని ఇంట్లో పెట్టుకుని తగుదునమ్మా అని మళ్ళీ షష్టిపూర్తి పేరుతో పెళ్ళి చేసుకున్నారే... మీకామాత్రం ఆలోచన ఎందుకు రాలేదు.

కొడుక్కి ప్రేమ కావలసి వస్తే పెళ్ళి చెయ్యండి. పెళ్ళాన్ని ప్రేమించడం నేర్చుకోమనండి. అంతేకానీ కనబడ్డ ప్రతి అమ్మాయిని ప్రేమిస్తున్నానంటూ చెప్పి పరువు తీయమనవద్దని చెప్పండి. మీకు కావలసింది కట్నం, లక్షలు, లక్షలు. అంతేగా. అసలు నిజంగా నేను కల్యాణ్‌ని ఇష్టపడితే ఏం చేసేవారు. ఏం చెయ్యగలరసలు?

న్యాయంగా చెప్పాననేగా మీకింత చులకన. ఇంత ఖర్చుపెట్టి షష్టిపూర్తి చేసుకున్నారే, అదే ఈ డబ్బు ఖర్చుపెట్టి ఓ బీదపిల్ల పెళ్ళి చెయ్యండి. ఎంత తృప్తి, ఎంత ఆనందం కలుగుతాయో! ఒక పెళ్ళికే దేశంలో ఇంతమంది అమ్మాయిలు ఏడుస్తుంటే... తిరిగి పెళ్ళి చేసుకుని సంతోషంతో ఉన్న మీకివన్నీ ఎలా తెలుస్తాయండీ అసలు...

మీ కొడుకుని అదుపులో పెట్టుకోండి. గుడ్‌బై... మీ కన్నకొడుకు నాకు రాసిన లేఖ తీసి చదువుకోండి. ఎవరిది తప్పో తెలుస్తుంది..." అంటూ చేతిలో నలుగుతున్న ఉత్తరాన్ని అక్కడ టేబిల్‌పై పడేసి గిర్రున వెనక్కి తిరిగింది కావ్య.

ఉత్తరాన్ని తీసి చదివారు ఆనందరావుగారు.

"కావ్యా...!" మృదువుగా పిలుస్తున్న ఆయన పిలుపుకి చటుక్కున ఆగింది కావ్య.

ఆయన దగ్గరకి వస్తూ భుజం తడుతూ "నిజం... కావ్యా...! నువ్వు నా కళ్ళు తెరిపించావు. 'కట్నం' నీ ఈడు పిల్లల్ని ఎలా హింసపెడుతోందో తెలిపావు. కట్నం ఇవ్వలేని ఎంతోమంది అమ్మాయిలున్న ఈ దేశంలో షష్టిపూర్తి అంటూ మళ్ళీ నేను పెళ్ళి జరిపించుకోవడంలో అర్థం లేదు. నిజం. ఐ... లైక్... యూ... మై గర్ల్..." అన్నారు ఆనందబాష్పాలతో.

"సా...ర్" ఆశ్చర్యంగా చూస్తూ అంది కావ్య.

"అవును కావ్యా! నీకూ, కల్యాణ్ కీ పెళ్ళి జరిపిస్తాను. ప్రామిస్..." ఆయన దృఢంగా అన్నారు.

*